డిఇఒగా ప్రేమ్‌కుమార్

లింగేశ్వరరెడ్డికి ఆర్‌జెడిగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా విద్యా శాఖ అధికారిగా ఎన్. ప్రేమ్ కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు విద్యా శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ డిఇఒగా ఉన్న బి.లింగేశ్వరరెడ్డి ఆర్‌జెడిగా ఉద్యోగోన్నతి పొందడంతో గుంటూరు బదిలీ అయ్యారు. ఈనేపథ్యంలో ఆయన స్థానంలో పార్వతీపురం మన్యంజిల్లా డిఇఒ ప్రేమ్‌కుమార్‌ను నియమించారు. డిప్యూటీ డిఇఒగా ఉన్న వాసుదేవరావుకు రాజమండ్రి బదిలీ అయ్యింది. బొబ్బిలి డిప్యూటి డిఇఒగా బ్రహ్మాజీకి ఉద్యోగోన్నతి కల్పించి పాడేరు డిఇఒగా బదిలీ చేశారు.

నిరాశ

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల వాసులను మరోసారి నిరాశకు గురిచేసింది. నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలకు కేటాయింపులు తప్ప, జిల్లా అభివృద్ధికి, తలసరి ఆదాయం పెంచేందుకు దోహదపడే విధంగా నిధులు కేటాయింపులు లేవు. ముఖ్యంగా 80శాతం ప్రజలు ఆధారపడే వ్యవసాయానికి అత్యంత కీలకంగా వున్న సాగునీటి రంగంపై ఎప్పటి మాదిరిగానే తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది.

తోటపల్లి బ్యారేజీ

- ఏటా సాగునీటి రంగంపై నిర్లక్ష్యం
- పారిశ్రామికాభివృద్ధికీ కానరాని కేటాయింపులు
- సంక్షేమ పథకాల కొనసాగింపుతో సరి
- నివ్వెరబోతున్న ప్రజానీకం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంతో ఈసారి బడ్జెట్‌లోనైనా జిల్లా అభివృద్ధికి దోహదపడే సాగునీరు, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యతనిస్తారని, గతం కంటే బడ్జెట్ పెంచుతారని జిల్లా ప్రజానీకం ఆశించారు. ఆచరణలో అటువటిదేమీ కనిపించకపోవడంతో ప్రజలు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తోటపల్లి, రామతీర్థసాగర్ సాగునీటి ప్రాజెక్టులకు వందల రూ.కోట్లు కేటాయించాల్సి వుండగా గడిచిన నాలుగేళ్లలో అరకొరగా కేటాయించి, విడుదలలో మరింత కోత విధించారు. ఈసారి అటువంటి ఊరట కూడా కలగలేదు. అసలే విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు పారిశ్రామికంగా వెనుకబడివున్నాయి. జ్యూట్ పరిశ్రమలు దాదాపు మూతపడ్డాయి. ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు కొన ఊపిరితో నడుస్తున్నాయి. వీటిని ఆదుకునేందుకుగానీ, కొత్తపరిశ్రమల స్థాపనకుగానీ ఎలాంటి ప్రతిపాదనలు కూడా లేవు. మరోవైపు సేవారంగంలోనే జిల్లాకు తగిన కేటాయింపులు లేవు. ముఖ్యంగా వైసిపి అధికారంలోకి వచ్చాక సాగునీటి రంగంపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది.

64 వేల ఎకరాల పాత ఆయుకట్టును స్థిరీకరిస్తూనే కుడికాలువ ద్వారా అదనంగా 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో తోటపల్లి సాగునీటి ప్రాజెక్టును 2004లో చేపట్టారు. కేటాయించిన నిధుల్లోనూ విడుదలచేసిన మొత్తం ఇంకా తక్కువగానే ఉంది. 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-24 వరకు రూ.201.98 కోట్లు కేటాయించగా ఆచరణలో ఖర్చుచేసింది రూ.63.24కోట్లు మాత్రమే. ప్రస్తుత ధరలు, లెక్కల ప్రకారం ప్రాజెక్టు పనులు పూర్తిచేయడానికి 567.57కోట్లు అవసరం కాగా, ఈ ఏడాది తక్కువలో తక్కువగా రూ.161.96కోట్లు అవసరమౌతాయని సంబంధిత ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదన పంపినప్పటికీ, ప్రాజెక్టుల వారీగా కేటాయింపులను ప్రభుత్వం ప్రకటించలేదు. ఇదే ప్రాజెక్టుకు గత ఏడాది నిర్మాణ పనులకు రూ.294.90కోట్లు, సిఎడిడబ్ల్యుఎం పనులకు రూ.107.69కోట్లు, భూసేకరణకు 46.38కోట్లు, అర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి రూ.107.06కోట్లు చొప్పున మొత్తం రూ.556.03కోట్లు కేటాయించాలని కోరుతూ ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదనలు పంపగా, కేవలం రూ.84.20కోట్లు మాత్రమే కేటాయించారు. ఇందులోనూ ఖర్చుచేసింది అక్షరాల ఆరు కోట్ల అరవై నాలుగు లక్షలు మాత్రమే. ఇలా ఏటా తగినంతగా విడుదల చేయకపోవడం వల్ల తరచూ కాంట్రాక్టర్ పనులు నిలిపివేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. పెండింగ్ పనుల వల్ల సుమారు 68వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదు.

ఎప్పుడూ అంతంత మాత్రమే

తారకరామతీర్థసాగర్ జలాశయం, కాలువల నిర్మాణ పనులకు గడిచిన నాలుగేళ్లలో రూ.356.68కోట్లు కేటాయిస్తామని చెప్పిన ప్రభుత్వం, ఆచరణలో రూ.143.52కోట్లతో సరిపెట్టింది. ఈ ఏడాది రూ.399.18కోట్లు కేటాయించాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. తాజా బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టు నిధులపై స్పష్టత లేదు. గత ఏడాది కూడా నిర్మాణ పనులు, ఆర్‌అండ్‌ఆర్, భూసేకరణకు మొత్తం రూ.314.55కోట్లు కోరగా, రూ.60.62కోట్లు కేటాయించారు. ఈ రెండు ప్రాజెక్టులు తరువాత అత్యంత ప్రతిష్టాత్మకమైన జంఝావతికీ అంతంత మాత్రంగానే నిధులు కేటాయించారు. గత ఏడాది జంఝావతికి రూ.39.60లక్షలు, వెంగళరాయసాగర్‌కు రూ.14.72లక్షలు, మడ్డువలసకు రూ.17.57లక్షలు మాత్రమే కేటాయించారు.

తాటిపూడి, ఆండ్ర, పెద్దగెడ్డ, పెదంకలాం, డెంకాడ ఆనకట్టు, వట్టిగెడ్డ జలాశయాల ఆధునీకరణకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎలాంటి సహకారమూ లేదు. జెఎన్‌టియు గురజాడ వర్శిటీలో అదనపు భవనాలు వంటి మౌలిక వసతుల కల్పనకు ఎటువంటి నిధులు లేవు. ఇలా ఒకటి కాదు... రెండు కాదు.. ఏకంగా అన్ని అంశాల్లోనూ జిల్లాకు ఒరిగిందేమీ కనిపించలేదు. కేటాయింపులన్నీ నవరత్నాలు, జగనన్న, వైఎస్ఆర్ పేరిట ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల పద్దుల్లోనే కనిపిస్తున్నాయి. వివిధ శాఖలకు కేటాయింపులు కూడా తగ్గడంతో ప్రభుత్వం చెప్తున్న సుస్థిరాభివృద్ధి మేడిపండేనంటూ పలువురు విమర్శిస్తున్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న

మెగా డిఎస్‌సి ప్రకటించాలి

- అసెంబ్లీలో తీర్మానం చేయాలి
- డివైఎఫ్ఐ ఆధ్వర్యాన అభ్యర్థుల ర్యాలీ
- కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రప్రభుత్వం 25వేల టీచర్ పోస్టులకు మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యాన బుధవారం అభ్యర్థులు కోట జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు పిఎస్ఎన్ రాజు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్లుగా అదిగో డిఎస్‌సి, ఇదిగో డిఎస్‌సి అంటూ నిరుద్యోగులను మోసం చేసి నేడు ఎన్నికలు సమీపిస్తున్న వేళ అతి తక్కువ పోస్టులతో నోటిఫికేషన్ ఇవ్వడం అన్యాయమని అన్నారు. రాష్ట్రంలో 1.88లక్షల ఉపాధ్యాయులు ఉండాల్సిన చోట కేవలం 1. 69లక్షలు మాత్రమే ఉన్నారని, దాదాపు 18,520 ఖాళీ పోస్టులు ఉన్నాయని, ఇవి కాకుండా ఈనెలాఖరుకు మరో 5వేల మంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేయనున్నారని తెలిపారు. కేంద్రం చెబుతున్న లెక్కలు ప్రకారం 40వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 117జీవో పేరుతో మరో 10వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసిందని గుర్తు చేశారు. తెలుగు మీడియం తీసివేసి 15వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసిన ఘనత జగన్మోహనరెడ్డి ప్రభుత్వానిదే అన్నారు. జగనన్న ప్రభుత్వంలో 2వేల పాఠశాలలు మూసివేసిందని, ఇప్పటికే రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 9వేలు ఉన్నాయని, అయితే ప్రభుత్వం ఖాళీలు లేవని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సి హెచ్ హరీష్, ఉపాధ్యక్షులు సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు డ్రాపౌట్ కావడం లేదా ప్రైవేటు స్కూళ్లలో జాయిన్ అవ్వడం జరుగుతుందని, దాదాపు రెండేళ్లలో 6లక్షల మంది విద్యార్థులు ఇలా డ్రాపౌట్ అయ్యారని గుర్తుచేశారు. రాష్ట్రంలో దాదాపు 10 లక్షల మంది నిరుద్యోగులు డిఎస్‌సి కోసం నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్‌సి ప్రకటించాలని , లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతినిచ్చారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు, నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు, కె.రాణి, సూర్యనారాయణ తదితరులు

9న నులిపురుగుల నివారణ కార్యక్రమం

పిల్లలందరికీ మాత్రలు తప్పనిసరిగా వేయించాలి

డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 9న జిల్లాలోని 19 ఏళ్లలోపు వయసు గల బాల బాలికలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు ఇచ్చేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు చెప్పారు. జిల్లాలో 3.58 లక్షల మంది బాల బాలికలకు ఆరోజు భోజనం అనంతరం నులిపురుగల నివారణ మాత్రలు ఆల్బెండజోల్ వేయించేందుకు అవసరమైన 3.80 లక్షల మాత్రలు సిద్ధం చేశామన్నారు. బుధవారం తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారికి మినహా మిగతా పిల్లలందరికీ మాత్రలు వేయించాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు అక్కడే మాత్రలు ఇస్తారని, పాఠశాల బయట వుండే బాల బాలికలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తామని తెలిపారు. ఆ రోజున మాత్రలు వేయించలేని వారికి ఫిబ్రవరి 16న వేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. పిల్లలకు పొట్టలో నులిపురుగుల కారణంగా పోషకాల జీర్ణ ప్రక్రియకు ఆటంకం కలిగి శారీరక, మానసిక లోపాలకు రక్తహీనతకు దారితీస్తుందని పేర్కొన్నారు. తద్వారా పిల్లల్లో చురుకుదనం లోపించి నీరసపడిపోతారన్నారు. ఈ సమస్యతో బాధపడే పిల్లలు తరచూ అనారోగ్యంగా, అలసటగా వుంటూ, ఏకాగ్రత కోల్పోతారని పేర్కొన్నారు. ఇటువంటి పిల్లలకు ఆల్బెండజోల్ తో చికిత్స సురక్షితమైన, తక్కువ ఖర్చుతో కూడిన వైద్య పరిష్కారంగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. నులిపురుగుల నివారణ మాత్రలను ఆరునెలలకోసారి పిల్లలకు ఇవ్వాల్సి వుంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని వర్గాలు సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో అదనపు జిల్లా వైద్యాధికారి కె.రాణి, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సూర్యనారాయణ, ఆర్‌బిఎస్‌కె పిఒ డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చర్చలకు ససేమిరా

- నాయకులతో మాట్లాడి లేదన్న మిమ్స్ యాజమాన్యం
- సిఐటియు నాయకులు లేకుండా చర్చలకు వచ్చేది లేదన్న కార్మికులు
- మిమ్స్ మొండివైఖరితో రోగుల అవస్థలు
- 7రోజులుగా విధుల బహిష్కరణ
- బోధనాసుపత్రి ఎదుట కొనసాగుతున్న నిరసన శిబిరం

శిబిరంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఓవైపు ఉద్యోగులు, మరోవైపు రోగులు తీవ్ర సమస్యలతో సతమతమౌతుంటే... వాటిని పరిష్కరించాల్సిన మిమ్స్ మెడికల్ కాలేజీ యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోంది. డిసిఎల్ (డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్) ఎదుట బుధవారం జరగాల్సిన చర్చలపై ఆ యాజమాన్యం అనుసరించిన తీరే ఇందుకు తార్కాణం. అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని, పని ఒత్తిడి, వేధింపులు ఆపాలని, నూతన వేతన ఒప్పందం చేయాలని, పెండింగ్ డిఎ మొత్తం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మిమ్స్ ఉద్యోగులు ఈనెల 1నుంచి విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈనెల 5న కలెక్టరేట్ వద్ద అధిక సంఖ్యలో సిఐటియు నాయకత్వంలో నిరసన తెలియజేయడంతోపాటు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం విజయనగరంలోని డిఎసిఎల్ సుబ్రమణ్యం ఏర్పాటు చేసిన చర్చలకు మిమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టివి రమణ, ఎం.నారాయణరావు, ఆ సంఘానికి నాయకత్వం వహిస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ హాజరయ్యారు. అటు యాజమాన్యం తరపున హెచ్‌ఆర్ ఎం.శ్రీనివాసరావు, ఎఒ గోపాల కృష్ణంరాజు, డీన్ సిహెచ్ డాక్టర్ లక్ష్మీకుమార్, డైరెక్టర్ డాక్టర్ రఘురామ్ హాజరయ్యారు. డిసిఎల్ చర్చలు ప్రారంభించడానికి ముందే మిమ్స్ యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ తాము తమ సంస్థ ఉద్యోగులతో మాత్రమే మాట్లాడతామని, మిగిలినవారితో చర్చించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. దీంతో, మిమ్స్ నిరంకుశ మొండివైఖరిని అర్థం చేసుకున్న మిమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు (ఉద్యోగులు) తాము కూడా సిఐటియు నాయకులు లేకుండా చర్చల్లో పాల్గొనేది లేదని బదులిచ్చారు. దీంతో, కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ వద్ద సమస్యను తేల్చుకోవాలంటూ డిసిఎల్ సూచించారు. ఇక్కడి నుంచి తీవ్ర ఆగ్రహంతో వెనుదిరిగిన ఉద్యోగులు మిమ్స్ ఎదుట కొనసాగుతున్న శిబిరానికి చేరుకుని యాజమాన్యం మొండివైఖరిని మిగిలిన ఉద్యోగులతో కలిసి ఖండించారు. చావైనా రేవైనా సిఐటియుతో నేనని, ఆ నాయకుల అండలేకుండా సమస్యలు పరిష్కరించు కోలేమని, అందుకే కేవలం ఉద్యోగులతో మాట్లాడుతామంటూ యాజమాన్యం డొంకతిరుగుడు మాటలు ఆడుతోందని అన్నారు. శిబిరంలో తమ్మినేని సూర్యనారాయణ, టివి రమణ మాట్లాడుతూ మిమ్స్ ఉద్యోగులకు సిఐటియు అండగా నిలబడుతుందని అన్నారు. యూనియన్ మైనార్టీలోకి వెళ్లిన కాలంలో ఉద్యోగులకు యాజమాన్యం తీవ్ర అన్యాయం చేసిందని గుర్తుచేశారు. మిమ్స్‌లో పూర్వవైభవం తీసుకువస్తామని, సిఐటియు అండతో యాజమాన్యం ఆటలు కట్టిస్తామని ఉద్యోగులు అన్నారు. మరోవైపు మిమ్స్ యాజమాన్య మొండివైఖరితో ఆసుపత్రి మొత్తం ఖాళీ అయ్యింది. వైద్యసేవలు, ఇతర సదుపాయాలు అందుబాటులో లేక మంచాలపైవున్నవారు సైతం యాజమాన్యానికి శాపనార్థాలు పెట్టుకుంటూ ప్రత్యామ్నాయం చూసుకున్నారు. దీంతో, దాదాపు 1000 పడకలకుపైగావున్న ఆసుపత్రి కళ తప్పింది.

బుదరాయవలస పోలీసుస్టేషన్‌లో పోలీసుల అదుపులో ఉన్న ఆశా వర్కర్లు

ఆశా వర్కర్లపై నిర్బంధం

- పలుచోట్ల అరెస్టులు.. పోలీసు స్టేషన్లకు తరలింపు
- చలో విజయవాడ భగ్నం చేసేందుకు యత్నం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కనీస వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఆశావర్కర్లు చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈనేపథ్యంలో విజయవాడ వెళ్లకుండా ఆశావర్కర్లను, సిఐటియు నాయకులను తమ ఇళ్ల వద్ద పోలీసులు గృహ నిర్బంధం చేశారు. పలుచోట్ల అరెస్టులు చేసి బొబ్బిలి, బుదారయవలస,గుర్ల, రాజాం,బొండపల్లి, వేపాడ పోలీసుస్టేషన్లకు తరలించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు, బి.మంగమ్మ,పి.కృష్ణవేణి, డి.సుజాత, చంద్రకళ, గౌరి, అనసూయ, అప్పలకొండ, సన్యాసమ్మ తదితర నాయకులను అదుపులోకి తీసుకున్నారు. జిల్లాలో బుధవారం ఉదయం నుంచి ఆశా కార్యకర్తలు ఇళ్లకు, వారు పని చేస్తున్న చోటకు వెళ్లి అ ముందస్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఇళ్లలో ఉన్న వారిని గృహ నిర్బంధం చేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 40 మందిని పోలీసులు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి మాట్లాడుతూ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాల్సింది పోయి పోలీసులను ఉపయోగించి అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.

గ్రూప్-2 అభ్యర్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ

స్టడీ మెటీరియల్ అందజేస్తున్న జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గ్రూప్ 2కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు బుధవారం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ 2 పరీక్షకు చదువుతున్న ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థులకు ఉచిత శిక్షణ కార్యక్రమం బిసి స్టడీ సర్కిల్ ద్వారా డిసెంబర్ 28 నుండి ఫిబ్రవరి 24 వరకు (50 రోజులు) ఎంపిక కాబడిన 80 విద్యార్థులకు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. స్టడీ మెటీరియల్ లేని 44 మంది విద్యార్థులకు జిల్లా పరిషత్ నిధుల నుండి ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ రాజ్‌కుమార్, బిసి సంక్షేమ శాఖ అధికారి సందీప్ కుమార్ పాల్గొన్నారు.

విద్యాశాఖలో భారీ అవినీతి : నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం కోట

విద్యాశాఖలో భారీ అవినీతి జరిగిందని టిడిపి విజయనగరం పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున ఆరోపించారు. బుధవారం స్థానిక అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండేళ్లుగా విద్యాశాఖలో అవినీతి పెచ్చుమీరందన్నారు. పాఠ్యపుస్తకాల ముద్రణలోను, నాడు-నేడు పనుల్లోనూ అవినీతి చోటు చేసుకుందని ఆరోపించారు. దీనికి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు ఐవిపి రాజు, ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి అవార్డుల పంట

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని జోగిరాజుపేటకు చెందిన వైద్య విద్యార్థి డాక్టర్ కొంచాడ రవికిరణ్‌కు వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ అవార్డులు వరించాయి. ఎంబిబిఎస్ ఇఎన్‌టి విభాగంలో రాష్ట్రంలో అత్యుత్తమ స్కోర్ సాధించినందుకు 2020 సంవత్సరానికి గాను డాక్టర్ పి.ఎన్ రావు అవార్డు, డాక్టర్ ఎస్ఎన్ మూర్తి అవార్డులు అందుకున్నారు. మంగళవారం విజయవాడ యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన స్నాతకోత్సవంలో రవికిరణ్‌కు ఈ అవార్డులను ప్రదానం చేశారు. డాక్టర్ రవికిరణ్ ప్రస్తుతం సాలూరు మండలం బాగువలస పిహెచ్‌సిలో వైద్యాధికారిగా పనిచేస్తున్నారు. తండ్రి కొంచాడ సూర్యనారాయణ సతివాడ పిహెచ్‌సిలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా, తల్లి అనసూయ గ్రామంలో రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నారు. శ్రీకాకుళం రిమ్స్‌లో ఎంబిబిఎస్ పూర్తి చేసిన రవి కిరణ్ డిస్టెంక్షన్‌లో ఉత్తీర్ణులై 12 బంగారు పతకాలు సాధించారు. రవికిరణ్‌కు వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ అవార్డులు రావడంతో పాటు వైద్య విద్యలో కనబరుస్తున్న ప్రతిభ పట్ల తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అవార్డు అందుకుంటున్న డాక్టర్ రవికిరణ్

కోడ్ వచ్చేవరకు ఓటర్ల జాబితాలో మార్పులు

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల ప్రకటన వెలువడే వరకూ ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చెప్పారు. అయితే పేర్ల తొలగింపునకు సంబంధించి నియోజకవర్గంలో 0.1 శాతం దాటితే ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత జాబితాలో మార్పులకు, తొలగింపునకు అవకాశం ఉండదని, నామినేషన్ల గడువు వరకు చేర్పులు మాత్రమే ఉంటాయని స్పష్టం చేశారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో తన ఛాంబర్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, మార్పులు, చేర్పులు, తొలగింపుల పట్ల ఆయా పార్టీల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 4,400 ధరఖాస్తులు వచ్చాయని, వాటిని త్వరగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే తమకు అందిన ఫిర్యాదులపైనా చర్యలు తీసుకొని, వాటి వివరాలను తెలియజేస్తామని అన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, నియోజకవర్గాల ఇఆర్‌ఒలు ఎల్.జోసెఫ్, పి.మురళీకృష్ణ, నూకరాజు, ఎన్నికల సూపరింటెండెంట్ ప్రభాకర్, రాజకీయ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల యాప్‌ల విషయంలో గోప్యత ముఖ్యం

వివిధ రకాల ఎన్నికల యాప్‌లు, ఆన్‌లైన్ అప్లికేషన్ల వినియోగంలో తప్పనిసరిగా భద్రత, గోప్యతను పాటించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఐటికి సంబంధించిన అంశాల్లో సమయపాలన, భద్రతతోపాటు, ఖచ్చితమైన సమాచారం అందించాలని సూచించారు. జిల్లా స్థాయి ఎన్నికల శిక్షణా కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో ఐటి అప్లికేషన్లకు సంబంధించిన కార్యకలాపాలపె పవర్ పాయింట్ ద్వారా శిక్షణ ఇచ్చారు. సిపిఒ పి.బాలాజీ, డిఇఒ ఆర్.నరేంద్ర మాస్టర్ ట్రైనీలుగా వ్యవహరించి శిక్షణ ఇచ్చారు. వెబ్ కాస్టింగ్, ఇవిఎంల ర్యాండమైజేషన్, ఇటిపిబిఎస్, ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్, ఐటి స్టాఫ్ గురించి వివరించారు. యాప్‌ల వినియోగాన్ని వివరించారు. ఎన్నికల ముందు, ఎన్నికల సమయంలో, ఎన్నికలు పూర్తి అయ్యాక చేయాల్సిన కార్యకలాపాలు, వినియోగించాల్సిన యాప్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఐటి అప్లికేషన్స్, యాప్స్‌లకు సంబంధించిన పాస్ వర్డ్స్ విషయంలో గోప్యత పాటించాలని, అనధికార వ్యక్తులు వినియోగించే అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికలకోసం నియమించే కంప్యూటర్ ఆపరేటర్లతోపాటు, కార్యాలయాల్లో ఉన్న ఆపరేటర్లను కూడా దీనికి వినియోగించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, మెప్మా పీడీ సుధాకరరావు, ఎన్నికల సూపరింటిండెంట్ ప్రభాకర్, ఎన్ఐసి నుంచి బాలు, వివిధ నియోజకవర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఆర్ఎంపిల సంఘం అధ్యక్షులుగా కనకాచారి

ప్రజాశక్తి- డెంకాడ

జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం (ఆర్ఎంపి) అధ్యక్షులుగా గొడ్డుపాలెం గ్రామానికి చెందిన పొన్నాడ కనకాచారిని ఏకగ్రీవంగా ఆ సంఘం సభ్యులు బుధవారం ఎన్నుకున్నారు. మండలంలో పెద్ద తాడివాడ గ్రామం సమీపంలో సంగం సభ్యులు సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షునితో పాటు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఏఏఎన్ శర్మ, ఉపాధ్యక్షులుగా ఎస్. గౌరియుడు, కోశాధికారిగా వై.సోమేశ్వరి, జాయింట్ సెక్రెటరీగా బి.వైకుంఠరావు, ఎస్.నారాయణరావు, గౌరవ అధ్యక్షులుగా ఈ. గోపాలరావు, ముఖ్య సలహాదారుగా భీమాలి రాజు, సెక్రెటరీగా వి.ఆనంద్, ప్రచార కార్యదర్శిగా పి. సూర్యారావును ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన కనకాచారి మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఘనంగా రమాబాయి జయంతి

వేపాడ: మండల కేంద్రంతో పాటు సింగరాయి, గుడివాడ, జాకేరు, డిఆర్‌పేట, వావిలపాడు గ్రామాల్లో బుధవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి జయంతి వేడుకలను మహిళా సంఘాల సభ్యులు ఘనంగా నిర్వహించారు. రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా, దళిత సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

డబ్బులు ఎప్పుడు చెల్లిస్తారు?

బొబ్బిలి: పట్టణంలో టిడ్కో ఇల్లు రద్దు చేసుకున్న లబ్ధిదారులకు తిరిగి డబ్బులు ఎప్పుడు చెల్లిస్తారని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదరరావు ప్రశ్నించారు. బొబ్బిలిలో ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ పట్టణ పేదలకు రూపాయికే టిడ్కో ఇల్లు రిజిస్ట్రేషన్ చేస్తామని ఇప్పటికే చెల్లించిన లబ్ధిదారు వాటా డబ్బు యాభై శాతం తిరిగి ఇచ్చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంత వరకూ డబ్బులు తిరిగి ఇవ్వలేదన్నారు. ఇంటి కోసం రూ.25 వేల నుంచి లక్ష రూపాయల వరకూ లబ్ధిదారులు చెల్లించారని వైసిపి ప్రభుత్వం వచ్చాక ఇళ్లు రద్దు చేసుకున్న వారికి డబ్బులు చెల్లిస్తామని చెప్పినా ఇప్పటికీ ఇవ్వలేదన్నారు.

వైసిపిలోకి 50 కుటుంబాలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని కొమిరి వెంకటాపురం గ్రామానికి చెందిన కింజరాపు అనంతరావు, గంగు లక్ష్మునాయుడు వర్గీయులు 50 కుటుంబాలు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ తలే రాజేష్ ఆధ్వర్యంలో టిడిపిని వీడి వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి సంక్షేమం, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. అనంతరం ఖండ్యాం, వన్నలి తదితర గ్రామాల్లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాజేష్ పాల్గొని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండల ఛైర్మన్ గేదెల వెంకటేశ్వర రావు, ఎంపిపి అప్పలనరసమ్మ, వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్ మోహన్ రావు, యూత్ పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, మండల జెసిఎస్ కన్వీనర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది ఆరోగ్యానికి ప్రాధాన్యత

శృంగవరపుకోట: ఆర్‌టిసి తమ సిబ్బంది ఆరోగ్యంతో పాటు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత నిస్తుందని డిపో మేనేజర్ కె రమేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్‌టిసి డిపోలో డిపో మేనేజర్ కె. రమేష్ విశాఖ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఆర్‌టిసి ట్రాఫిక్, గ్యారేజ్, సెక్యూరిటీ, ఆఫీస్ సిబ్బంది వారి కుటుంబ సభ్యులు మొత్తం 50 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ జి. అశ్విని, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ నాయుడు, ఇతర సహాయ వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ట్రాఫిక్, గ్యారేజ్, సెక్యూరిటీ, ఆఫీస్ సిబ్బంది వారి కుటుంబ సభ్యులు కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

బీపీ చెక్ చేసుకుంటున్న మేనేజర్

బల్లంకి పాఠశాల పరిశీలన

వేపాడ: మండలంలోని బల్లంకి ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి. బాల భాస్కర్ బుధవారం పరిశీలించారు. అన్ని తరగతి గదులు, నోట్ పుస్తకాలను తనిఖీ చేశారు. విద్యార్థులు ఉపయోగిస్తున్న మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుల టీచింగ్ డైరీలు, విద్యార్థులకు ఇస్తున్న భోజనాలను కూడా పరిశీలించారు. ఈ పరిశీలనలో పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు సిఆర్‌పిలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ సందర్శన

బొబ్బిలి: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ ఎల్. రామలక్ష్మి బుధవారం క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా పర్యావరణ ఇంజనీరు, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలతో రాని మల్లమ్మ దేవి పార్క్ ఏరియా, రామన్న దొరవలస వద్ద గల సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పార్క్, జగనన్న కాలనీలను సందర్శించారు. మల్లమ్మ దేవి పార్క్ ఏరియా వద్ద గల బస్సు సెంటర్ వద్ద చేపలను విక్రయిస్తున్న వారిని పరిశీలించి బస్సు షెల్టర్ వద్ద ఉన్న ప్రయాణికులకు ఇబ్బంది తలెత్తకుండా చేపల కేంద్రాన్ని వేరొక చోటులో ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. రామన్న దొరవలస వద్ద గల సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పార్కుల పరిశీలించి వర్మీ కంపోస్ట్ తయారు చేసే ప్రక్రియను పరిశీలించారు. పొడి చెత్తను అట్ట, గుడ్డ, పేపరు, గ్లాసులుగా విభజించడాన్ని పరిశీలించారు. ఎఫ్ఎస్‌టిపి ప్లాంట్‌ను సందర్శించి ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. డాగ్ స్టెరిలైజేషన్ సెంటర్లో వీధి కుక్కలకు శస్త్ర చికిత్స జరగడాన్ని పరిశీలించి వారికి సూచనలు చేశారు. అనంతరం జగనన్న కాలనీలలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు.

వేస్టు మేనేజ్‌మెంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రధానోపాధ్యాయులు

రోడ్డు సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- భోగాపురం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోడ్ సేఫ్టీ కార్యక్రమాన్ని అశోక బిల్డ్ కాన్ బుధవారం నిర్వహించింది. ఈ సందర్భంగా పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రోడ్డు సేఫ్టీకి సంబంధించిన వివరాలను విద్యార్థులకు వివరించారు. రోడ్లపై ప్రయాణం చేసేటప్పుడు ఎటువంటి నిబంధనలు పాటించాలన్న దానిపై వీడియో రూపంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలలో క్విజ్ పోటీలను నిర్వహించి గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో అశోక బిల్డ్ కాన్ మేనేజర్ రామస్వామి, హెచ్ఆర్ మేనేజర్ ఫణింద్రబాబు, భద్రతాధికారి భారిక్, హైవే పెట్రోలింగ్, హైవే అంబులెన్స్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై వ్యాసరచన పోటీలు

విజయనగరం కోట : రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా బుధవారం కామాక్షినగర్‌లో గల శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారుర. విజయనగరం ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలని, ప్రస్తుత కాలంలో యువత ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాల కారణంగా మరణిస్తున్నారని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాలను నడపడం వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ ఎమ్. జ్యోతి , అసిస్టెంట్ మేనేజర్ బి. ఆదినారాయణ, ఆర్‌టిసి సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ వై.కాసులమ్మ, డిపో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాజు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయమే బార్

● అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా ఎంఆర్ఒ ఆఫీసు ● అద్దాలు పగలగొట్టి మందుబాబుల జల్సాలు ● పట్టించుకోని కాంట్రాక్టర్, రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి- రేగిడి

రేగిడి మండల కాంప్లెక్స్‌లో ఉన్న నూతన తహశీల్దార్ కార్యాలయం వద్ద నిత్యం అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. నిర్మాణంలో ఉన్న ఈ కార్యాలయాన్ని మందులు బాబు బార్‌గా మార్చేసుకున్నారు. ప్రతి రోజు సాయంత్రం పూట వందలాది మంది మందుబాబులు ఇక్కడకు చేరుకుని మద్యం సేవించి జల్సాలు చేస్తుంటారు. కార్యాలయం ముందు, వెనుక భాగాల్లో మద్యం బాటిళ్లు దర్శనమిస్తుండటమే దీనికి నిదర్శనం. కాగా ఈ కార్యాలయాన్ని పగటి పూట ప్రేమికులు సైతం వినియోగించుకుంటున్నట్లు తెలిస్తోంది. రాత్రి మందుబాబులు పగలు ప్రేమికుల అసాంఘిక కార్యక్రమాల నడుమ నూతన తహశీల్దార్ కార్యాలయం నలిగిపోతుందని స్థానికులు వాపోతున్నారు. మందుబాబుల ఆగడాలకు అక్కడ ఏర్పాటు చేసిన అద్దాల కిటికీలు కూడా పగలిపోయి కనిపిస్తున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చును.

రేగిడి తహశీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో 2018 ఏప్రిల్ 22న టిడిపి ప్రభుత్వ హయాంలో ఎస్‌డిపి నిధులతో అప్పటి జిల్లా కలెక్టర్ జవహర్ రెడ్డి రూ.90 లక్షలతో నూతన తహశీల్దార్ కార్యాలయం మంజూరు చేశారు. ఈ కార్యాలయ నిర్మాణానికి మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు చేతుల మీదుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. 9 నెలల్లో ఈ నూతన తహశీల్దార్ కార్యాలయం అన్ని అంగులతో పూర్తిచేసి అప్పగించాలని కాంట్రాక్టర్ శ్రీనివాసరావుతో ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే చివరి దశకు వచ్చినప్పటికీ ప్రభుత్వం పూర్తిగా బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

పిచ్చిమొక్కల మధ్యలో ఉన్న నూతన తహశీల్దార్ కార్యాలయం

ఇప్పుడున్న ప్రభుత్వం కూడా నిధులు మంజూరు చేయకపోవడంతో ధరలు పెరిగి నిర్మాణం భారాన్ని భరించలేని కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. దీంతో నిర్మాణం పూర్తి కాలేదు.

పిచ్చిమొక్కల నడుమ భవనం

నిర్మాణం 90 శాతం పూర్తి కావచ్చినా కాంట్రాక్టర్‌కు నిధులు చెల్లించకపోవడంతో పనులను ఆపేశారు. నిర్మాణం చేసి ఇప్పటికి సుమారు ఆరు సంవత్సరాలు కావడంతో వినియోగంలో లేని భవనం చుట్టూ పిచ్చి మొక్కలు చేరి ప్రారంబం కాకముందే శిధిలావస్థకు చేరేలా కనిపిస్తోంది. పాత తహశీల్దార్ కార్యాలయం శిధిలావస్థలో ఉండటంతో సిబ్బంది అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ఉద్యోగం చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. ఈ భవనం ఎప్పుడు కూలుతుందోనని భయభ్రాంతులకు గురవుతున్నారు.

ఆర్‌డిఒ ఆరా

ఇటీవల నూతన ఆర్‌డిఒగా వచ్చిన బొడ్డేపల్లి శాంతి నూతన తహశీల్దార్ కార్యాలయం నిర్మాణ పనులు ఎంతవరకు వచ్చాయని తహశీల్దార్ బి సుదర్శన్‌రావును అడిగి తెలుసుకున్నారు. బదిలీపై వచ్చిన తహశీల్దార్ వీటి విషయంపై చెప్పలేని పరిస్థితి నెలకొంది. పరిస్థితిని కాంట్రాక్టర్, ఆర్అండ్‌బి అధికారులను పిలిపించి మాట్లాడి అన్ని అంగులతో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ సూచించారు. ఆరేళ్ల గడిచినా ఎందుకు అసంపూర్తిగా ఉందో తెలుసుకుని నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. కానీ పనులు మాత్రం ముందుకు సాగలేదు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి నూతన తహశీల్దార్ కార్యాలయాన్ని మందు బాబుల నుంచి రక్షించి నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, అధికారులు కోరుతున్నారు.

కార్యాలయం ఆవరణలో పడి ఉన్న మద్యం సీసాలు, వాటర్ బాటిళ్లు

నులిపురుగుల నివారణకు చర్యలు

ప్రజాశక్తి- డెంకాడ

నులిపురుగుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ఎస్. భాస్కరరావు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నులిపురుగల నివారణ ప్రచార పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం పాఠశాలలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ నెల 9 నుంచి పాఠశాలలు, కళాశాలలో 1-19 సంవత్సరాల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు మింగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ లవరాజు, డెంకాడ, మోపాడ పిహెచ్‌సిల వైద్యాధికారులు డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ యోగితా బాల, ఎంఇఒ వెంకటరమణ, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ వై చలమయ్య ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణకు గోడ పత్రికను బుధవారం ఆవిష్కరించారు. ఫిబ్రవరి 9 నుంచి అంగన్వాడి, పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నులుపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఒక సంవత్సరం నుంచి 2 ఏళ్ల లోపు అరమాత్ర, 3 నుంచి 19 ఏళ్ల వరకు ఒక మాత్ర వాడాలన్నారు. నులు పురుగులు ఉన్న పిల్లలలో శారీరక, మానసిక ఎదుగుదల ఉండకపోవడం, కిషోర్ బాలికల్లో పోషక ఆహారం లోపం, రక్తహీనత ఉంటుందని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల్లోనూ 1221మంది, పాఠశాలల్లో విద్యార్థులు 3,171 మంది పిల్లలకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వీరితో ఎంపిహెచ్ఇఒ రధాకృష్ణ, పిహెచ్ఎన్ సావిత్రి, సూపర్‌వైజర్ సాయికృష్ణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాత్రలను పంపిణీ చేస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

9న డివార్మింగ్ డే

ఈ నెల 9న డివార్మింగ్ డే సందర్భంగా రేగిడి ఆరోగ్య కేంద్రం పరిధిలో నులిపురుగులు మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ అసిరి నాయుడు తెలిపారు. ఇప్పటికే హెల్త్ క్లినిక్ల ద్వారా సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు.

రామభద్రపురం: ఈ నెల 9న నిర్వహించే జాతీయ నులుపురుగుల దినోత్సవం (నేషనల్ డీ వార్మింగ్ డే) విజయవంతం చేయాలని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి పిల్లి దిలీప్ కుమార్ తెలిపారు. స్థానిక పిహెచ్‌సిలో బుధవారం ఆయన ఆయన మాట్లాడుతూ రెండు నుండి 19సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు, యువతకు నులి పురుగుల నివారణ మాత్రలైన అల్బెండజోల్ పంపిణీ చేస్తామన్నారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న 8 సచివాలయాల పరిధిలో గల 28 అంగన్వాడీ కేంద్రాలు, 26 ప్రభుత్వ పాఠశాలలు, 3 ప్రైవేటు పాఠశాలలు, 1 ప్రైవేటు కళాశాల లో చదువుతున్న సుమారు 4 వేల మంది విద్యార్థులకు ఒక్కొక్క మాత్ర పంపిణీ చేసేందుకు సిద్ధం చేశామన్నారు. ఈ మాత్రలు మద్యాహ్నం భోజనం అనంతరం నమిలి మింగాలన్నారు. ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయాల ఆరోగ్య సహాయకులు, పాఠశాలలో సిబ్బంది విధిగా పాల్గొనాలని కోరారు. గైర్హాజరైన పిల్లలు ఉంటే వారిని గుర్తించి మరలా ఈ నెల 16న పంపిణీ చేస్తామని చెప్పారు. ఆరికతోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కూడా వీటి పంపిణీ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో హెల్త్ సూపర్వైజర్ వాసుదేవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

డిఎతో కలిపి వేతనాలివ్వాలి

నెల్లిమర్ల: జ్యూట్ కార్మికులకు ఫిబ్రవరి డిఎతో కలిపి వేతనాలివ్వాలని సిఐటియు అనుబంధ జ్యూట్ మిల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన డిప్యూటి లేబర్ కమిషనర్‌ని కలిసి నెల్లిమర్ల జ్యూట్ కార్మికులకు ఫిబ్రవరి నెల డిఎతో కలిపి వేతనాలు ఇవ్వాలని కోరారు. జ్యూట్ యాజమాన్యం 2016 నుంచి పేరుకు పోయిన గ్రాడ్యుటీ బకాయిలు చెల్లించలేదని తెలిపారు. రిటైర్ కార్మికులకు యాజమాన్యం ప్రతి నెలా గ్రాడ్యుటీ చెక్కులు ఇవ్వాల్సి ఉండగా రెండు, మూడు నెలలకు ఒకసారి ఇవ్వడం, రిటైర్డ్ కార్మికులు గ్రాడ్యుటీ డబ్బుల కోసం బ్యాంక్‌కు వెళ్తే అకౌంట్‌లో డబ్బులు యాజమాన్యం వేయకపోవడం వల్ల రిటైర్డ్ కార్మికులు నానా ఇబ్బందులూ పడుతున్నారని తెలిపారు. కార్మికుల నుంచి యాజ మాన్యం అప్పుగా తీసుకున్న 5,10, 18 రూపాయలు ఇంత వరకు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం అన్యాయమన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ కూడా యాజమాన్యం సంబంధిత అధికార్లకు గతకొన్ని నెలలుగా చెల్లించలేదన్నారు. దీని ఫలితంగా రిటైర్డ్ కార్మికుల వారికి రావాల్సిన పిఎఫ్ బకాయిలు, పింఛన్ సౌకర్యం పొందలేక నానా ఇబ్బందులూ పడుతున్నారని డిసిఎల్‌కు వివరించారు.

రూ. 7405.51 కోట్లతో పిఎల్‌పి

ప్రజాశక్తి -విజయనగరం

జాతీయ వ్యవసాయ, గ్రామీణ భివృద్ధి బ్యాంకు(నాబార్డ్) 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన జిల్లా పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ ను రూ. 7405.51 కోట్లతో కలెక్టర్ నాగలక్ష్మి ఆమోదం తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పాలసీలను, జాతీయ ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని వివిధ శాఖల సమన్వయంతో రూపొందించిన పిఎల్‌పిని కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన డిసిసి సమావేశంలో కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లాకు సంబంధించి, ప్రాధాన్యతా విభాగంలో 2024-25 ఆర్థిక సంవత్సరం లో క్రెడిట్ పొటెన్షియల్ కింద వ్యవసాయ ఇతర రంగాలకు అంచనా వేశామన్నారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంట ఉత్పత్తి, నిర్వహణ, మార్కెటింగ్‌కు రూ.3929.13 కోట్లు, వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాల కోసం టర్మ్‌లోన్ 675.32 కోట్లు, వ్యవసాయం మౌలిక సదుపాయాలకు రూ.83.29 కోట్ల రూపాయలను అంచనా వేశారు. వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు 41.25 కోట్లు, క్రెడిట్ పొటెన్షియల్ ఫర్ అగ్రికల్చర్ కు 4728.99 కోట్లు, సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా సంస్థలు 899.60 కోట్లు, ఎగుమతి క్రెడిట్ 4.48 కోట్ల కు అంచనాలు వేశారు. విద్య కు రూ. 47.79కోట్లు, హౌసింగ్‌కు 502.04 కోట్లు, బ్యాంక్ క్రెడిట్‌తో కూడిన సామాజిక మౌలిక సదుపాయాలు 8.35 కోట్లు, డ్వాక్రా సంఘాలు, అసంఘటిత రంగం 1210.00 కోట్లు మొత్తం ప్రాధాన్యత రంగానికి రూ. 7405.52 కోట్లు కేటాయించారు. జగనన్న తోడు 9వ విడత నిధులకు డిసిసిలో ఆమోదం తెలిపారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ కె.కార్తీక్ మాట్లాడుతూ కౌలు రైతులకు శతశాతం రుణాలు అందజేయాలని బ్యాంకర్లకు కోరారు. కార్యక్రమంలో నాబార్డ్ డిడిఎం టి.నాగార్జున, సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఎల్‌డిఎం శ్రీనివాస రావు, పలు బ్యాంకు లకు చెందిన అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డిఇఒను సత్కరిస్తున్న విద్యాశాఖ సిబ్బంది

డిఇఒ సేవలు స్ఫూర్తిదాయకం

విజయనగరం టౌన్ : జిల్లా విద్యా శాఖ అధికారిగా విధులు నిర్వహించిన లింగేశ్వర రెడ్డి సేవలు స్ఫూర్తిదాయకమని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యాశాఖ అధికారులు కొనియా డారు. ఉద్యోగోన్నతిపై ఆర్‌జెడిగా బదిలీపై వెళ్తున్న ఆయన్ను బుధవారం సాయంత్రం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా.లింగేశ్వర రెడ్డి మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖలో రెండు దఫాలుగా పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం బదిలీపై రాజమండ్రి డిఇఒగా వెళ్తున్న డిప్యూటీ డిఇఒ వాసుదేవ రావు మాట్లాడుతూ క్రమ శిక్షణకు మారుపేరు లింగేశ్వర రెడ్డి అన్నారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని తాము కూడ పని చేస్తామన్నారు.

11న జిల్లాస్థాయి వెటరన్ బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం డిఎస్ఎ ఇండోర్ స్టేడియంలో ఈనెల 11వ తేదీ ఆదివారం జిల్లాస్థాయి వెటరన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్, సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సలహాదారు డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. ఈ పోటీల్లో అండర్ 35, 40, 45, 50, 55, 60, 65, 70 వయసుగల స్త్రీ, పురుషులు విభాగంలో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో బ్యాడ్మింటన్ పోటీలు ఉంటాయన్నారు. ఏ భాగంలో అయినా సింగిల్స్ ఆరు టీములు, డబుల్ 6 టీములు, మిక్స్‌డ్ డబుల్స్ 6 టీములు ఉంటేనే పోటీలు నిర్వహిస్తారని, లేకపోతే సెలక్షన్స్ మాత్రమే నిర్వహిస్తారని చెప్పారు. ప్రవేశ రుసుం సింగిల్స్‌కు రూ.500, డబుల్స్ రూ.1000 చెల్లించి పోటీల్లో పాల్గొనాలన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్స్, షీల్డ్ బహుమతులుగా అందజేస్తారని చెప్పారు. ప్రతి భాగంలోనూ సింగిల్స్ అయితే ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారిని, డబుల్స్ విభాగంలో ప్రథమ స్థానం సాధించిన వారిని ఈనెల 16 నుండి 18వ తేదీ వరకు తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని శ్రీరాములు తెలిపారు. జిల్లాలో ఉండే క్రీడాకారులందరూ పాల్గొనాలని, పోటీల్లో పాల్గొనే ప్రతి క్రీడాకారుడు తప్పనిసరిగా వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్ అందజేయాలని అన్నారు. 10వ తేదిలోగా బొబ్బిలి కె. అపర్ణ బాబా 7981111705, సాలూరు బహుదూర్ తాపా 9494594356, చీపురుపల్లి పీసీ స్వరూప్ 9885830520, విజయనగరం నున్నా సురేష్ 94405 85553, కొత్తవలస వై.గణేష్ 9032919065, ఎస్.కోట పొట్నూరు శ్రీరాములు 9490265104లకు ప్రవేశ రుసుం, ఆధార్ కార్డు జెరాక్స్‌తో పేరు నమోదు చేసుకోవాలని శ్రీరాములు కోరారు.

వికలాంగులకు ఉపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తవలస

మంగళపాలెంలోని గురుదేవ్ ట్రస్టులో బుధవారం వికలాంగులకు నోయిడా ఇస్కాన్ టెంపుల్ సహాధ్యక్షులు హెచ్.జి.వేదాంత చైతన్య దాస్ స్వామీజీ చేతులు మీదుగా విర్కో ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో ఉపకరణాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అవయవాలు కోల్పోయినా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. దేశ నలుమూలల నుంచి వస్తున్న లక్షలాదిమంది వికలాంగులకు ఉచితంగా ఉపకారణాలను అందించడంతో పాటూ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్న ట్రస్ట్ సేవలను కొనియాడారు. ముందుగా ట్రస్ట్ ప్రాంగణంలోని అవయవ తయారీ కేంద్రం, గురుదేవ హాస్పటల్స్‌ను ఆయన సందర్శించారు. అనంతరం విర్కో ఫౌండేషన్ సిఎస్ఆర్ నిధులు సుమారు రూ.20లక్షలతో సమకూర్చిన 288 మంది వికలాంగులకు సిఇఒ తిరుమూరు ప్రవీణతో కలిసి కృత్రిమ కాళ్ళు, చేతులు, బ్లైండ్ స్టిక్స్, చంక కర్రలు, చెవిటి మిషన్లు, వీల్ చైర్స్ ఉచితంగా అందజేశారు. 100మంది అంధులకు పింఛన్లు, 200 మంది వృద్ధులకు బియ్యం పంపిణీ చేశారు.కార్యక్రమంలో బిఎంఎస్ ఆలిండియా ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.సురేంద్ర(ఢిల్లీ), రాష్ట్ర కార్యదర్శి, కె.లోవరెడ్డి, కృష్ణ కళాశాల ఇంగ్లీషు లెక్చరర్ రామారావు, గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్, వైస్ చైర్మన్ డాక్టర్ ఫణీంద్ర, డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ కిషోర్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపకరణాలను అందిస్తున్న నిర్వాహకులు

నగర పంచాయతీలో జెఎఎస్ శిబిరం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధి పద్మశాలి వీధి సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. డాక్టర్లు దక్షయ, చంద్ర మౌళి, తిరుమలదేవి, టి.రమణమ్మ రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజినీ, వైస్ చైర్మెన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, వైసిపి పట్టణ అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, నగర పంచాయతీ కమీషనర్ పి.బాలాజీ ప్రసాద్, వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, బోర్డు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం పరిశీలన

బొబ్బిలి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో పేదలకు మేలు జరుగుతోందని బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు అన్నారు. పట్టణంలోని కంచరవీధి సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 శిబిరాన్ని ఆయన బుధవారం సందర్శించారు. వైద్యులతో మాట్లాడి అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మొదటి విడత కార్యక్రమం విజయవంతం కావడంతోనే రెండో విడత జెఎఎస్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించి ందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణారావు, వైసిపి పట్టణ అధ్యక్షులు చొడిగింజల రమేష్ నాయుడు, కౌన్సిలర్ బొత్స రమణమ్మ, వైసిపి నాయకులు ముగుది మురళీ, మున్సిపల్ టిపిఆర్ఒ జగన్మోహన్ రావు, వైద్య సిబ్బంది, సచివాలయం కన్వీనర్లు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య తనిఖీలను పరిశీలిస్తున్న వైసిపి నాయకులు

సైకో పాలనను గద్దె దించండి

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలో సాగుతున్న సైకో పాలనను గద్దె దించాలని టిడిపి విజయనగరం నియోజక ఇన్‌ఛార్జి అదితి గజపతి పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం విటి అగ్రహారంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు, రాష్ట్రాన్ని కాపాడాలంటే తెలుగుదేశం - జనసేన ప్రభుత్వం ఏర్పడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, వేచలపు శ్రీనివాసరావు, రాజేష్ బాబు, రొంగలి రామారావు, గంగిరెడ్ల శంకర్రావు, బోడసింగి అప్పారావు, పైలా మహేష్, పొంతపల్లి శ్రీను, శ్రీభార్కి, బంగారురాజు, మిరియాల శంకర్రావు, గొలగాని సత్తిబాబు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

విటి అగ్రహారంలో ప్రచారం చేస్తున్న అదితి గజపతిరాజు

'ఆమె మా పార్టీ సర్పంచ్ కాదు'

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని వెల్దూరు సర్పంచ్ నాయన సత్యవతి తమ పార్టీకి చెందిన సర్పంచ్ కాదని వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు తెలిపారు. మంగళవారం టిడిపిలోకి వైసిపి పార్టీకి చెందిన సర్పంచ్ చేరినట్లు వచ్చిన వార్తలకు ఆయన బుధవారం స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యవతి సర్పంచ్ అవకముందు 2019 ఎమ్మెల్యే ఎన్నికల్లో ఆమె వైసిపిలో ఉందన్నారు. ఎన్నికలు అనంతరం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమె టిడిపి నేతలతో కలసి సర్పంచ్‌గా పోటీ చేసారన్నారు. ఆ తరువాత జరిగిన ఎంపిటిసి ఎన్నికల్లో ఆమె టిడిపితోనే ఉందన్నారు. వెల్దూరు ఎంపిటిసిగా వైసిపి బీఫాం ఇచ్చిన అభ్యర్థిని గెలిపించుకున్నామన్నారు. కావాలని ఎన్నికలు ముందు సర్పంచ్‌లు టిడిపిలో చేరుతున్నారని ప్రచారం చేసుకుంటున్నారని తప్పుబట్టారు. సమావేశంలో వెల్దూరు నాయకులు దారపు గున్నారెడ్డి, అప్పలసూరిరెడ్డి, వైస్ ఎంపిపి అల్లాడ రమేష్, పుప్పాల లక్ష్మినారాయణ, మండల జెసిఎస్ కన్వినర్ మహంతి శ్రీనివాసరావు, రౌతు సాయికుమార్, కొప్పెర్ల ఉప సర్పంచ్ రాజారావు, పబ్బిరెడ్డి అప్పడుదొర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో మహిళ దుర్మరణం

ప్రజాశక్తి - కొత్తవలస

విశాఖ- అరకు జాతీయ రహదారిలో మండలంలోని చింతలపాలెం సమీపంలో బుధ వారం ఉదయం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. కొత్తవలస సిఐ వి.చంద్రశేఖర్ తెలిపిన వివరాలు ప్రకారం.. కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధి 202 కాలనీకి చెందిన పిన్నింటి లక్ష్మి (45) దినసరి కూలీగా పనిచేస్తుంది. ఎప్పటిలాగే మేస్త్రి శ్రీనుతో పాటు కూలి పనికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా చింతలపాలెం వద్ద వెనక నుంచి వస్తున్న ఆర్‌టిసి బస్సు ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై నుంచి శ్రీను, లక్ష్మి ఇద్దరు చల్లా చెదురుగా పడ్డారు. శ్రీను రోడ్డుకు ఎడమవైపున పడటంతో స్వల్ప గాయాలయ్యాయి. లక్ష్మి రోడ్డుకు కుడివైపున పడిపోవడంతో ఆమె తలపై నుంచి బస్సు వెళ్లిపోయింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త సన్యాసిరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఎస్. కోట సిహెచ్‌సికి తరలించామని సిఐ తెలిపారు.

దొంగతనం కేసులో వ్యక్తి అరెస్ట్

వంగర: మండల కేంద్రంలో ఈ ఏడాది జనవరి 25వ తేదీన జరిగిన నగదు చోరీ కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వై.వి. జనార్ధన్ బుధవారం తెలిపారు. వంగర గ్రామానికి చెందిన కోరాడ సూరమ్మ ఇంట్లో రూ.లక్ష నగదు పోయినట్లు అప్పట్లో ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసులో సంగాం గ్రామానికి చెందిన బొడ్రోతు నరసింహులు దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

జూదగాళ్లు అరెస్టు

వేపాడ: మండలంలోని జాకేరులో జూదమాడుతున్న నలుగురును వల్లంపూడి ఎస్ఐ రాజేష్ పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.57,400 నగదు 2 బైకులు, 4 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పెదగుడిపాలలో 10 లీటర్ల నాటు సారా ఊటను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తిని అదుపులో తీసుకుని కేసు నమోదు చేశారు.